తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

# ముఖం చాటేసిన వర్షాలు.. ముందుకు సాగని పనులు



**- వర్షాభావ పరిస్థితుల్లో అన్నదాతల ఆందోళన**

కోట, జూలై26 ప్రభాతవార్త : వరుణదేవుడు ముఖం చాటే యడంతో వ్యవసాయం పనులు ముందుకు సాగడం లేదు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. భూగర్భ జలమట్టాలు సైతం లోతుకు పడిపోతుం డటం, బోరు బావుల నుంచి నీటి దార తగ్గిపోతుండటంతో పంటల సాగు సందిగ్ధంలో పడిపో యింది. అప్పుడప్పుడు పడుతున్న చిరు జల్లులు మెట్ట పంటలకు ప్రాణం పోస్తున్నా.. ప్రధానంగా వరికి శరాఘా తంగా మారింది. వరిపంట కోసం నార్లు పోసిన రైతులు భారీ వర్షాల కోసం ఆశతో నింగిలోకి తొంగి చూస్తున్నారు. పలుచోట్ల పోసిన నార్లు ముదిరిపోతున్నాయి. చెరువులు, కుంటల్లో నీటి మట్టం తగ్గిపోయింది. సమృద్ధిగా వర్షాలు లేక కర్షకుల్లో ఆశలు తగ్గిపోతున్నాయి. ఈ ఏడాది అయినా సమృద్ధిగా వర్షాలు కురిసి పుష్కలంగా పంటలు పండించాలని భావించిన మెట్ట ప్రాంత రైతులు పాతాళ గంగ పైకి రాకపోవడంతో బెంగపెట్టుకున్నారు. బోరు బావులు ఒట్టిపోయే దశకి చేరుకున్నాయి. వర్షాకాలం సీజన్ నుంచి నేటి వరకు కురిసిన జల్లులు ఏమాత్రం ప్రభావం చూపడం లేదు. సాగునీరు మృగ్యమై పంటలు వేసే ప్రక్రియ ఊటిసలాట నడుమ కొనసాగుతోంది. కరెంటు ఉన్నా నీరు రావడం లేదని రైతులు వాపోతున్నారు. పంటలు సాగు చేయాలా వద్దా అనే ఆలోచనలో రైతులు అయోమయంలో పడిపోయారు.

# క్వారీ ఆగడాలకు అడ్డేది!

**-ఇష్టారాజ్యంగా అక్రమ తరలింపులు- పన్నుల ఎగవేత -నిద్రావస్థలో అధికార యంత్రాంగం**
**-పర్యావరణరీత్యా పొంచిఉన్న ప్రమాదం -కాలుష్యకోరల్లో బిక్కుబిక్కు మంటున్న పల్లెజీవనం**

సత్యవేడు, జూలై26 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలో మైనింగ్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. క్వారీల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడు తున్నారు. త్రవ్వకాల్లో నిబంధనలు గాలికి వదిలేస్తున్నారు. అనుమతులు లేకుండానే యదేచ్ఛగా త్రవ్వకాలు చేపడుతున్నారు. అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారగనం మూముళ్ళమత్తులో జోగుతుంది. వివరాల్లోకెళితే... పివిపురం పంచాయతీలో కొన్ని క్వారీల ఆగడాలను అడిగే దిక్కెలేకుండా పోయింది. ఈక్వారీల నిర్వాహకులు అందరూ బడా బాబులే. వీరికి అధికారులు, రాజకీయ నాయకులు పుష్కలంగా అండదండలు అందిస్తున్నారు. దీంతో క్వారీ, క్రషర్ వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతూ కోట్లకు పడగలెత్తుతున్నారు.

**-పర్యావరణ అనుమతులు లేకున్నా:**

కంకర క్వారీలు, క్రసర్లు నిర్వహించాలంటే పర్యావరణశాఖ, అగ్నిమాపకశాఖ, గనులశాఖ అనుమతులు తప్పనిసరి. త్రవ్వకాలకు పరిధి ఉంటుంది. అయితే క్వారీ, క్రషర్ నిర్వాహకులు చాలామంది నిబంధనలు పాటించడంలేదు. సుమారు ఏడాదికాలంగా పాత క్వారీలకు పర్యావరణశాఖ అనుమతులు ఇవ్వడంలేదు. అయినా త్రవ్వకాలుమాత్రం నిరాటకంగా సాగుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.



అనుమతులకు మీరి లోతునకు తవ్వుతున్న క్వారీ నిర్వాహకులు

**-అనుమతులు ఒకచోట..త్రవ్వకాలు ఇంకోచోట:**

క్వారీల త్రవ్వకాలకోసం రెవిన్యూవారు భూమిని కేటాయిస్తారు. ఈభూమిలోనే త్రవ్వకాలు చేపట్టాలి. మండలంలోని క్వారీల నిర్వాహకులు మాత్రం తమకు కేటాయించిన స్థలంలో కాకుండా మరోచోట త్రవ్వకాలు జరుపుతున్నారు. అలాగే అనుమతించిన దానికంటే ఎక్కువ విస్తీర్ణంలో త్రవ్వకాలు చేస్తున్నారు. క్వారీ, క్రసర్ నిర్వాహకులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను చెల్లించకుండా టోకరా వేస్తున్నారు. నిబంధనలు ప్రకారం క్యూబిక్ మీటర్‌కు రూ॥75 చెల్లించాలి. పన్ను మరో రూ॥20 ఉంటుంది. మొత్తంగా ఒక క్యూబిక్ మీటర్‌కు రూ॥95 చెల్లించాలి. అయితే ఏడాది కాలంగా పన్నులు చెల్లించకుండానే త్రవ్వకాలు సాగిస్తున్నారు. క్వారీలో 40ఎంఎం, 20 ఎంఎం, 12 ఎంఎం, 6 ఎంఎం కంకర తయారుచేస్తున్నారు. వీటితో పాటు కంకర దుమ్ము కూడా తయారు చేస్తారు. తమిళనాడు రాష్ట్రంలో వీటికి మంచి గిరాకీ ఉండటంతో రోజుకు 200 లారీలకు పైగా అక్రమంగా తరలిస్తున్నారు. పైసా పన్నుకూడా కట్టినట్లు సమాచారంలేదు. కంకర, దుమ్ము తరలింపులో నిబంధనలు అతిక్రమి స్తున్నారు. పదిటన్నుల సామర్థ్యం గల లారీలో 16 టన్నులు నింపుతున్నారు. 14 టన్నుల లారీలో 20 టన్నులు నింపుతున్నారు. దీన్ని అడ్డుకోవాల్సిన రవాణాశాఖ నిమ్మకునీరెత్తినట్లు ఉంటోంది. అడపా దడపా తనిఖీలు నిర్వహించి లారీలను సీజ్ చేస్తున్నా..అవి మామూళ్ళు ఇవ్వనివి మాత్రమే. మామూళ్ళు అందించే వారికి దాడుల వివరాలు ముందుగా చేరవేస్తున్నారు. కంకర, దుమ్ము రవాణా చేస్తున్న లారీలకు వే బిల్లులు కూడా ఉండటం లేదు.

**-కొత్త క్వారీల పేరుతో:**

కొత్త క్వారీల పేరుతో పాతవాటిలోనే త్రవ్వకాలు సాగిస్తున్నారు. మన జిల్లాలో ఏడాదిగా పాత క్వారీల్లో తవ్వకాలకు అనుమతులు ఇవ్వడంలేదు. కొంతమంది కొత్తక్వారీలకు అనుమతులు సంపాదించి, అక్కడ తవ్వకాలకు ఎక్కువ వ్యయం అవుతుందని చెప్పి, పాత క్వారీల్లోనే తవ్వకాలు జరుపుతున్నారు. క్వారీల్లో బ్లాస్టింగ్ చేయడానికి అనుమతులు ఉన్నాయి. ఎక్కువలోతు నాట్లు వేసి నల్లమందు పేల్చకూడదు. అయితే ఒకేసారి పెద్దమొత్తంలో బండలను పేల్చడం కోసం లోతుగా నాట్లువేసి నల్లమందు పేల్చుతున్నారు. ఇలా చేయడం వల్ల క్వారీలకు సమీపంలోని ఇళ్ళు దెబ్బతింటున్నాయి. పక్కాగృహాల ఇంటిగోడలు ఒడుబారుతున్నాయి. బ్లాస్టింగ్ సమయంలో రాళ్ళు ఇళ్ళపై పడుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని బ్రతుకుతున్నారు. ఇక నల్లమందు పేల్చడానికి లైసెన్స్ ఉన్న వ్యక్తులు అవసరం, అయితే చాలా క్వారీల్లో లైసెన్స్‌లేని వ్యక్తులతో కానిచ్చేస్తున్నారు. తద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయి. కాలుష్యపు కోరల్లో క్వారీల పరిసర గ్రామాలు చిక్కుకుంటున్నాయి. గాలి, నీరు కాలుష్యం అవుతున్నాయి. ఫలితంగా జనాలు రోగాలు భారీన పడుతున్నారు. పలువురు అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. ఫ్లోరైడ్ కారణంగా పిల్లలు, పెద్దలు ఇబ్బందిపడుతున్నారు. చిన్నవయసులోనే వృద్ధులుగా మారిపోతున్నారు.

**- ప్రభుత్వాధికారులు స్పందించాలి**

క్వారీల్లో అక్రమాలను అరికట్టాల్సిన అధికారులు మాముళ్ళమత్తులో మునిగిపోతున్నారు. గనులు, అగ్నిమాపక, రవాణశాఖ వారికి క్వారీల నిర్వాహకులు నెలసరి మామూళ్ళను సమర్పిస్తున్నారు. దాంతో అధికారులు నోరుమెదపడం లేదు.

# అధ్వాన్నంగా... అన్నమయ్య కాలిబాట!



అన్నమయ్య కాలిబాట మార్గం

ప్రభాతవార్త -తిరుమల: శ్రీవేంకటేశ్వరస్వామి ప్రియభక్తుడు... పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు నడచిన కాలిబాట అధ్వాన్న ంగా తయారైంది. గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వం లోని టిటిడి ధర్మకర్తలమండళ్ళు ఈ కాలిబాట అభివృద్ధి మాటలకే పరిమితంచేశారు. ఐదువేలకోట్ల రూపాయలు వార్షిక బడ్జెట్ రూపొం దిస్తున్నా తిరుమలకొండపై పార్వేటమండపం వద్ద నుంచి మామండూరు మీదుగా పూర్తిగా దట్టమైన అటవీప్రాంతంలోనే ఈ కాలిబాట ఉండటంతో తిరుమలకు మూడవ ఘాట్‌రోడ్డుగా ప్రత్యామ్నాయంగా తీర్చిదిద్దాలనే గతంలో ఆలోచన చేశారు. అన్నమయ్యకాలిబాట మార్గాన్ని పూర్తిగా నడకదారి భక్తులకు వీలుగా నిర్మించాలనే యోచన దాదాపు తొమ్మిదేళ్ళుగా వస్తోంది. అన్నమయ్య కాలిబాట మార్గాన్ని అభివృద్ధిచేసి, హైదరాబాద్, కర్నూలు, కడప వైపు నుండి తిరుమలకు వచ్చే భక్తులకు సులభంగా, వీలుగా కాలిబాట మార్గాన్ని తీర్చిదిద్దాలనేది నిర్ణయం. అయితే ఈ నిర్ణయాలకు ఎక్కడికక్కడ బ్రేక్ పడుతూనే ఉంది. 2021వ సంవత్సరంలో తుఫాన్ సంభవించి బలమైన వరదలతో తిరుమలకు ఇప్పటికే ఉన్న ఘాట్‌రోడ్డులు, కాలినడక మార్గాలు పూర్తిగా కోతకు గురవడం, కొట్టుకుపోవడం, రక్షణగోడలు ధ్వంసమవడం జరిగింది. కాలినడక మార్గాల్లో బండరాళ్ళు జారిపడ్డాయి. దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అవాంతరాలు కలగడమేగాక టిటిడికి తీవ్ర నష్టం వాటిల్లింది. ఏకంగా పదిరోజులు తిరుమల రెండోఘాట్‌ను మూసివేసి మొదటిఘాట్‌పైనే రాకపోకలు సాగించారు. ఆ తరువాత వరదలు తగ్గడంతో ఘాట్‌రోడ్లను అభివృద్ధిచేసి వాహనాలను పూర్తిస్థాయిలో అనుమ తినించారు. ఆ వరదల సమయంలో తిరుమలకు ప్రత్యామ్నాయంగా మూడో ఘాట్‌రోడ్డు (కాలిబాట) అవసరాన్ని టిటిడి గుర్తించింది. ఇందుకు అన్నమయ్యకాలిబాటను తీర్చిదిద్దే యోచనతో ప్రతిపాదనలు రూపొందించింది. అటవీశాఖల నుంచి అనుమతి రావలసి వుందని సమాచారం. టిటిడి ఇంజనీరింగ్ అధికారులు మూడేళ్ళ క్రిందటే తిరుమల పార్వేట మండపంనుండి కడప మార్గంలో శేషాచలంఅడవిలో మామండూరు, కుక్కలదొడ్డి వరకు కాలినడకన వెళ్ళి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. టిటిడి అధికారులు మాత్రం కొండకు మూడోప్రత్యామ్నాయ నడకదారిగా ఉంటుందని భావించారు.

# తిరుపతి ట్రాఫిక్ డిఎస్పీ... మొబైల్ స్విచ్‌ఆఫ్ !

ప్రభాతవార్త-తిరుపతిటౌన్: పోలీసుశాఖలో ఎస్‌ఐ స్థాయి నుండి సిఐలు, డిఎస్పీలు, అదనపుఎస్పీలు, జిల్లా ఎస్పీలు, ఆపై డిఐజి, డిజిపిల వరకు సమాచారం ఇచ్చిపుచ్చుకునేందుకు ఒకే నెట్‌వర్క్‌క్రింద మొబైల్‌ఫోన్‌లు అందుబాటులో వచ్చాయి. దీనివల్ల జిల్లాలోని పోలీసు అధికారులు తమ సిబ్బందితోగానీ, ఇతర పోలీసు అధికారులతో అవసరమైన సమాచారం తెలియజేసేందుకు, తెలుసుకోవడానికి సులభంగా గ్రూప్‌కాల్స్ క్రింద ఫోన్‌నంబర్లు కేటాయించారు. అయితే యాత్రాస్థలం తిరుపతి జిల్లాకేంద్రంలో పోలీసుశాఖలో ప్రధానమైనట్రాఫిక్ విభాగం డిఎస్పీ మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లోనే ఉంది. పోలీసుశాఖలో జిల్లాలోని పోలీసు అధికారులకు గ్రూప్‌గా మాట్లాడుకునేందుకు వీలుగా కొన్నేళ్ళ క్రిందట బిఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్‌తో మొబైల్‌నంబర్లు కేటాయించారు. ఇందులో తిరుపతి ట్రాఫిక్ డిఎస్పీకి 9491086023 నంబర్ ఉంది. ఈ నంబర్ గత రెండుమూడునెలలుగా స్విచ్‌ఆఫ్ వస్తూనే ఉంది. ఎవరైనా పోలీసు అధికారులు, పోలీసు సిబ్బందిగాక ప్రజలు, వాహనదారులు, ఫిర్యాది దారులు ట్రాఫిక్‌లో తలెత్తిన సమస్యలు, ఇబ్బందులు, క్రిందిస్థాయి పోలీసు సిబ్బందిపై ఫిర్యాదులు చేయాలంటే డిఎస్పీకి విన్నవించాలి. అయితే గత నాలుగునెలలుగా ఈ మొబైల్ నంబర్ స్విచ్‌ఆఫ్ వస్తూనేఉంది. ఇంతకీ తిరుపతి ట్రాఫిక్ డిఎస్పీ ఉన్నాడా?లేక సిఐలతోనే పాలనసాగిస్తున్నారా అనేది నగరవాసులు, వాహనదారులు ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో చాలాప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు ఎదురవతున్నాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో నగరంలోని గాంధీరోడ్డు, మాస్కురోడ్డు, తిలక్‌రోడ్డు, భవానీనగర్, ఎంఆర్‌పల్లి. ఆర్‌సిరోడ్డు, లక్ష్మీపురం సర్కిల్ నుండి టివిఎస్ షోరూమ్ సర్కిల్ వరకు ట్రాఫిక్ తలనొప్పులు తప్పడంలేదు. ఇక్కడ సమస్యలపై ఫిర్యాదుచేయాలంటే డిఎస్పీ నంబర్ స్విచ్‌ఆఫ్ వస్తోందని పలువురు వాహనదారులు చెబుతున్నారు. అస్సలు ట్రాఫిక్ డిఎస్పీ ఎవరనేది కూడా పోలీసుశాఖలో హాట్‌టాఫిక్‌గా మారింది. మరీ దీనిపై నూతన ఎస్పీ లంకెల సుబ్బరాయుడు విచారణ చేపట్టి డిఎస్పీ మొబైల్ ఏమైందో ప్రజలకు అందుబాటులో తీసుకువస్తారని భావిస్తున్నారు.

# క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పశువైద్య సేవలు : కలెక్టర్

చిత్తూరుటౌన్, జులై 26 ప్రభాతవార్త: గ్రామ సచివాలయ పశువర్ధక శాఖ సహాయకులు క్షేత్ర స్థాయిలో పాడి రైతులకు విస్తృతంగా సేవలు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. చిత్తూరు మ్యాంగో భవన్‌లో శుక్రవారం జిల్లా పశుసంర్ధకశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో వున్న 282 పశుసంవర్ధక సహాయకులతో కలెక్టర్ సుమిత కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని 31 మండలాల పరిధిలో దాదాపు 5.50 లక్షల మంది రైతులు వ్యవసాయంతో పాటు పాడిపోషణపై ఆధారపడి జీవిస్తున్నారని, వర్షధార పరిస్థితులు వుండటంతో పాడిపోషణ జీవనాధారంగా ఇక్కడ వుందన్నారు. పశుసంవర్ధకశాఖ సహాయకులు వారి పరిధిలోని పాడి పశువులకు సంబంధించి పూర్తి సమాచారంతో పాటు పాడి రైతులకు సకాలంలో అందుబాటులో వుండి వారికి సేవలు అందించడానికి కృషి చేయాలన్నారు. సచివాలయ పరిధిలోని పాడి రైతులతో సత్‌సంబంధాలు కలిగి వుండి పాడి పశువుల ఆరోగ్యం, పాల ఉత్పత్తి పెంపుపై తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై వారికి అవగాహన కల్గించి పాడి రైతుల ఆదాయం పెరిగేలా చూడాలన్నారు. పశుసంర్ధకశాఖ సహాయకులు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు గ్రామ సచివాలయంలో అందుబాటులో వుండి వారి పరిధిలోని 300 నుండి 400 పాడి పశువుల యోగ క్షేమాలు చూసుకోవాలన్నారు. అలాగే గొర్రెల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. డైరీల నుండి పాడి రైతులకు రావాల్సిన డబ్బులు సక్రమంగా వస్తున్నాయా! పాడి రైతులకు మరిన్ని పశువులు అవసరం అవుతాయా! అనే విషయాలను సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. డిఆర్‌డిఎ ద్వారా ఎస్‌హెచ్‌జి గ్రూపుల వారికి పశువుల పెంపకం, షెడ్‌ల ఏర్పాటు వంటి స్కీమ్‌లకు అర్హులను గుర్తించాలన్నారు. పాలు తక్కువ ఇస్తున్న పశువులను గుర్తించి వాటికి అవసరమైన పోషణ, చికిత్స చేయాలన్నారు. పశు సంవర్ధకశాఖ సహాయకుల పనితీరు ప్రతి పదిహేను రోజులకు ఒకసారి పాడి రైతుల ద్వారా సమీక్షించడం జరుగుతుందన్నారు. అలాగే పశుసంర్ధకశాఖ సహాయకులు పాడి పశువులకు వైద్య సేవలు అందించడానికి అవసరమైన మందులు అందించాలని, అలాగే ఉచితంగా సైలేజ్, టిఎంఆర్(టోలర్ మిక్చర్ రేషన్)ను రైతులు కోరుతున్నారని, అలాగే పాడి పశువులు మృతి చెందితే ఆర్థిక సహాయం అందించాలని పాడి రైతులు కోరుతున్నారని పశుసంవర్ధకశాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువస్తే వీటిని పరిశీలిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ ప్రభాకర్, సహాయ సంచాలకులు, పశుసంవర్ధకశాఖ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



పశుసంవర్ధకశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

**మ్యాంగో భవన్‌ను పరిశీలించిన కలెక్టర్ :**

చిత్తూరు మ్యాంగో భవన్‌లోని వసతులను కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. జిల్లా పండ్ల పరిశ్రమ సమాఖ్య కార్యదర్శి గోవర్ధన్ బాబ్జీ, ఇతర సభ్యులు కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి మామిడి గుజ్జు పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు, చిత్తూరులో ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో ఏర్పాటు, సాలిడ్ వేస్ట్ ట్రీట్మెంట్ గురించి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారితో చర్చించి బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటుపై వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ స్పందించి ఈ విషయమై ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిశీస్తానని చెప్పారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్ మ్యాంగో భవన్‌ను సందర్శించి అక్కడ వున్న వసతులు, ప్రయోగశాలలను, విదేశీ ఎగుమతుల కోసం చేస్తున్న పరీక్షలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సమీర్‌శర్మ, ధనంజయనాయుడు, బషీర్, ధనంజయ, విద్యా సాగర్‌రెడ్డి, అమరనాథ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# కుప్పంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా... స్కూలు ఏర్పాటు

**- ఉచిత డిఎస్సీ కోచింగ్ సెంటర్ ప్రారంభిస్తాం -మహిళల సంక్షేమం.. ఆర్థిక బలోపేతమే లక్ష్యం ! -సిఎం సతీమణి నారా భువనేశ్వరి**

కుప్పం, జూలై 26 ప్రభాతవార్త : కుప్పంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా స్కూలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని సిఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం కుప్పం పట్టణంలో ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కుప్పంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. అలాగే కుప్పం ప్రాంతంలోని నిరుద్యోగ మహిళలకు ఉపయోగపడేలా ఉచితంగా డిఎస్సీ కోచింగ్ సెంటర్‌ను సైతం ప్రారంభిస్తామన్నారు. మహిళల సంక్షేమం, ఆర్థికబలోపేతమే లక్ష్యంగా ఎన్టీఆర్ ట్రస్ట్ ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. సిఎం చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ ట్రస్ట్‌ను సేవాభావంతో ప్రారంభించారన్నారు. చంద్రబాబు ఏ స్ఫూర్తితో ట్రస్ట్ ప్రారంభించారో అదే స్ఫూర్తితో తాము ముందుకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలకు కుట్టుశిక్షణ ఇస్తే వారి కాళ్లపై వారు నిలబడతారని అలాగే దుస్తులఫ్యాక్టరీలతో చర్చించి వాటిని ఇక్కడ కుట్టించి ఫ్యాక్టరీలకు విక్రయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మహాళలకు ఆసక్తిగా ఉన్న చేతి వృత్తుల్లో తగు శిక్షణ కల్పిస్తామన్నారు. శిక్షణ పొందిన మహిళలకు కోఆపరేటివ్ సొసైటీలు ఏర్పాటుచేసి మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు. మహిళలు తమ సంపాదనపై సంతృప్తి చెందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలు అన్ని రంగాల్లో శాసించే స్థాయికి ఎదిగారని దీనికి కారణం దివంగత ఎన్టీఆర్ అన్నారు. మహిళలకు ఆస్తిలో సగం హక్కు కల్పించారన్నారు. తిరుపతిలో మహిళలకు ప్రత్యేక యూనివర్సిటీ ప్రారంభించారని, మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించారన్నారు.



.స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నారా భువనేశ్వరి

మహిళలు తమ కాళ్లపై తాము నిలబడాలని, సమాజంలో గౌరవంగా బ్రతకాలని సిఎం చంద్రబాబు ఆలోచించి మహిళలకు అనేక పథకాలు తెచ్చారన్నారు.

**కష్టాల్లో ఉన్న వారిని నేనున్నానంటూ ఆదుకుంటున్న భువనమ్మ**

**- ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్**

రాష్ట్ర వ్యాప్తంగా ఎవరూ కష్టాల్లో ఉన్నా నేనున్నానంటూ నారా భువనమ్మ ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఆదుకుంటున్నారని ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నారా భువనమ్మ పనిచేస్తున్నారన్నారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు భువనమ్మ చేయబోతున్నారన్నారు. రానున్న కార్యక్రమంలో కుప్పంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను భువనమ్మ చేపడతారని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ సిఇఒ రాజేంద్రకుమార్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పరిశీలకుడు ఖాదర్ బాషా, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు సురేష్, జిమ్‌దాము, సోమశేఖర్, వేలు, జాకీర్, నేతలు సాంబశివం, కెవి శ్రీనివాసులు, డా॥ వెంకటేష్, ఆర్ముగం, ప్రతాప్, రవి, భాగ్యలక్ష్మి త్రిలోక్, వసంతమ్మ, జనసేన నరేష్, తదితరులు పాల్గొన్నారు.

**నారా భువనమ్మ దృష్టికి 977వినతులు :**

కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పాటు సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పర్యటించారు. ఈసందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు దాదాపు 977సమస్యలపై భువనమ్మకు వినతిపత్రాలు అందజేశారు. వీటిలో అత్యధికంగా భూ సమస్యలు, జగన్ పాలనలో రద్దు చేసిన సంక్షేమ పథకాలకు సంబంధించి అధికంగా ఉన్నాయి. ఈ సమస్యలను సంబంధిత అధికారులకు పంపించి సత్వర పరిష్కారానికి నారా భువనమ్మ చర్యలు తీసుకోనున్నారు.

# ఎంపిడివో తీరుపై జడ్పీ సీఈఓ ఆగ్రహం

**-ఎమ్పీడివోకు షోకాజ్ నోటీసు**



తనిఖీ చేస్తున్న జడ్పీ జిల్లా ముఖ్యకార్యనిర్వాహణ అధికారిణి గ్లోరియా

గంగవరం, జూలై 26 ప్రభాతవార్త : గంగవరం ఎమ్పీడివో మధుసూదన్‌రెడ్డి పనితీరుపై జిల్లా ముఖ్య కార్యనిర్వాహణ అధికారిణి గ్లోరియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్పీడివో మధు సూదన్‌రెడ్డి కార్యాలయంలో లేకపోవడంపై, ఎలాంటి అనుమతులు లేకుండా కార్యాలయం నుండి చెప్పాపెట్టకుండా వెళ్ళిపోవడం, రికార్డులు సక్రమంగా లేకపోవడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతలేని సంబందిత ఎమ్పీడివో ముధుసూదన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. మండలంలోని ఏ ఒక్క గ్రామంలోను తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సిబ్బందిని ఆమె ఆదేశించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..వర్షాకాలం అయినందున డయేరియా, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు గ్రామాల్లో, పట్టణాల్లో వ్యాప్తి చెందకుండా పూర్తి స్థాయిలో అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించింది. పారిశుద్ధ్యం, నీటి కలుషితం వల్ల ఎలాంటి అంటు వ్యాధులు వ్యాప్తి చెందకూడదని, ఒక్క మరణం కూడా సంభవించకూడదని వైద్య సిబ్బందితో కలిసి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో పర్యటించాలని వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె హెచ్చరించారు. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఆమె తెలిపారు. సచివాలయాలను ప్రతి రోజు పర్యవేక్షించి సిబ్బంది సకాలంలో విధులకు వస్తున్నారా లేదా పరిశీలించి ఉద్యోగులు తీరు సక్రమంగా లేకపోతే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. సోమవారం రోజు ఏ ఉద్యోగి సెలవు పెట్టరాదని, మండల కార్యాలయంలో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే ఫిర్యాదుపై స్పందించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి ప్రసాద్, ఏఓ వినోద, సీనియర్ సహాయకులు ఆనందబాబు, సిబ్బంది గాయత్రి, కుమార్‌లు పాల్గొన్నారు.

## రాయితీపై పశుగ్రాస విత్తనాలు

శ్రీరంగరాజపురం, జూలై 26 ప్రభాతవార్త: ప్రభుత్వం రైతులకు రాయితీపై పశుగ్రాస విత్తనాలు సరఫరా చేస్తోందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని తయ్యూరు పశువైద్య అధికారి డాక్టర్ శ్రీవిద్య తెలిపారు. 75 శాతం సబ్సిడీతో వెయ్యి కేజీల జొన్నలు, 1,500 కేజీల మొక్కజొన్నలు ఎస్ఆర్ పురం, తయ్యూరు పశువైద్య కేంద్రాల్లో రైతులకు అందుబాటులో వున్నాయన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు ఆధార్, పట్టాదార్ పాసుపుస్తకం తీసుకు రావాల్సి వుంటుందన్నారు.

## మోతాదుకు మించి డోస్ ఇస్తే కఠిన చర్యలు

– ఆర్ఎంపి, పిఎంపిలకు మండల వైద్యాధికారి వార్నింగ్



శ్రీరంగరాజపురం, జూలై 26 ప్రభాతవార్త: మండల పరిధిలోని ఆర్ఎంపిలు, పిఎంపిలు ఎవరైనా తమ వద్ద చికిత్స కోసం వచ్చిన రోగులకు మోతాదుకు మించి డోస్ ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆరిమాకులపల్లి పిహెచ్‌సి డాక్టర్ బాలకృష్ణారెడ్డి హెచ్చరించారు. ఆరుమాకులపల్లి, కొత్తపల్లిమిట్ట పరిధిలోని ఆర్ఎంపి, పిఎంపిలు, మెడికల్ షాపులను శుక్రవారం డాక్టర్ బాలకృష్ణారెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్ఎంపిలు, పిఎంపిలు రోగులకు ఇస్తున్న మందులను ఆయన పరిశీలించారు. కాలం చెల్లిన మందులు వాడినా, మోతాదుకు మించి మందు డోస్ ఇచ్చినా, స్టెరాయిడ్స్, యాంటీబయాటిక్ వాడి నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. ఒక కేంద్రంలో మందుల విక్రయాలకు మాత్రమే అనుమతి వున్నప్పటికీ అక్కడ వైద్యం చేస్తుండటం చూసి వదలివేయడం, అలాగే ఒక క్లినిక్‌లో కాలం చెల్లిన మందులు వున్నప్పటికీ ఏమి చెప్పకుండా చూసి చూడనట్లు వెళ్ళిపోవడం విమర్శలు వస్తున్నాయి. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పి కవిత, హెల్త్ అసిస్టెంట్ రామ్మోహన్, ఫార్మసిస్ట్ సురేష్, ఎఎన్ఎం వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ మంత్రిని కలిసిన దేవరాజన్



గుడిపాల, జూలై 26 ప్రభాతవార్త: రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను శుక్రవారం అమరావతిలోని అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో గుడిపాల మండల బిజెపి నాయకులు సావర్కర్ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ద్వారా అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమం అందాలంటే కూటమి పార్టీల్లోని నాయకులు కలిసికట్టుగా ముందడుగు వేయాలని చెప్పారు.

## అనాథ మహిళ అమ్మఒడి ఆశ్రమంకు తరలింపు



తవణంపల్లె, జూలై 26 ప్రభాతవార్త: గత కొద్ది రోజులుగా మండలంలోని అరగొండలో సంచిరిస్తున్న అనాథ మహిళను చిత్తూరు అమ్మఒడి ఆశ్రమంకు శుక్రవారం పోలీసుల చొరవతో తరలించారు. గత రెండు మూడు నెలలుగా తమిళనాడుకు చెందిన ముత్తవలి అనే మహిళ మతిస్థిమితం లేకుండా అరగొండ గ్రామంలో సంచిరిస్తూ వుండేది. ఆమె గతంలో భర్త పిల్లలలో వుండేదని అయితే గత కొంత కాలంగా ఒంటరిగా అరగొండలో సంచరిస్తూ వుండేది. ఈనేపథ్యంలో ఆమె రక్షణ దృష్ట్యా ఆమెను చిత్తూరు అమ్మఒడి ఆశ్రమంకు తరలించేందుకు స్థానిక ఎస్సై అనిల్‌కుమార్ చొరవచూపారు.

## కన్నులపండువగా అమ్మవారి తిరుచ్చివాహనసేవ



శ్రీకాళహస్తి, జూలై 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి శుక్రవారం రాత్రి స్వామిఅమ్మవార్ల దీపారాధన అనంతరం అమ్మవారి ఆలయం వెలుపల ఉన్న మండపంలో ఉన్న అమ్మవారి ఉత్సవమూర్తి జ్ఞానప్రసూనాంబికాదేవిని ఆలయంలోని అలంకార మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చివాహనంపై కొలువుదీర్చి వేదమంత్రాలు, మంగళవాయిద్యాలనడుమ అమ్మవారికి ఆలయ ప్రాకారోత్సవం, తిరుచ్చి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేకహారతులిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ ఎస్‌వి నాగేశ్వరరావు దంపతులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

చంద్రగిరి, జూలై 26 ప్రభాతవార్త: అగరాల వద్ద గల (చంద్రగిరి) ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా వున్న సీట్లు భర్తీ చేయడానికి ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుకుమార్ శుక్రవారం ఒ ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 30

## రూ.12.18 లక్షల కర్నాటక మద్యం ధ్వంసం

పలమనేరు,జూలై 26 ప్రభాతవార్త: పలు కేసులలో పట్టబడిన కర్నాటక అక్రమ మద్యాన్ని శుక్రవారం ఎన్ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవి, పలమనేరు సిఐలు చంద్రశేఖర్,చిన్నగోవిందు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు.ఈ సందర్భంగా ఎన్ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవి మాట్లాడుతూ పలమనేరు,గంగవరం పోలీస్ స్టేషన్ పరిధిలో కర్నాటక నుండి అక్రమంగా మద్యం తరలిస్తు పట్టబడిన మద్యాన్ని ధ్వంసం చేశామన్నారు.పలమనేరు పోలీస్ స్టేషన్ పరిధిలో 54 కేసులలో రూ.2.83లక్షలు విలువ చేసే 422 లీటర్ల మద్యాన్ని,గంగవరం పోలీస్ స్టేషన్ పరిధిలో 32 కేసులలో రూ.9.35లక్షలు విలువ చేసే 1336 లీటర్ల మద్యం ధ్వంసం చేశామని తెలిపారు.

## శాకాంబరి అలకంరణలో శ్రీశ్రీశ్రీచాముండేశ్వరీదేవి



నదుం,జూలై26 ప్రభాతవార్త : మండల పరిదిలోని జాండ్రపేటలో వెలసిన శ్రీశ్రీశ్రీ చాముండేశ్వరీదేవి అమ్మవారి దేవాలయంలో ఆషాడమాసం సందర్భంగా అమ్మవారికి శాకంబరి అలంకరణ చేశారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. ఈసందర్భంగా మహిళా భక్తులు కుంకుమ పూజ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు మాజీ వీఆర్వో రఘునాధరావు అమ్మవారికి విషేషంగా పూజలు జరిపారు.

## విష జ్వరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి



పెద్దపంజాణి జూలై 26 ప్రభాతవార్త : విద్యార్థులు ప్రస్తుత వర్షాకాల నేపథ్యంలో విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పెద్దపంజాణి వైద్యాధికారి డా॥ మురళీ పేర్కొన్నారు శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అతిసార వ్యాధి, విషజ్వరాలు, క్షయ,కుష్ఠ ,చర్మసంబంధిత వ్యాధులపై అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని సూచించారు.ప్రస్తుత తరుణంలో డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా తదితర విషజ్వరాలు ప్రబలే అవకాశముందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు,విద్యార్థులు పాల్గొన్నారు.

## అమరవీరులను స్మరించుకోవడం అందరి కర్తవ్యం :కలెక్టర్



చిత్తూరుటౌన్, జూలై 26 ప్రభాతవార్త: కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడిన అమర వీరులందరినీ స్మరించుకో వడం మన కర్తవ్యం అని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొ న్నారు. కార్గిల్ విజయ్ దివస్ పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్ కార్గిల్ యుద్ధంలో పోరాడిన సైనికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులు ఎనిమిది మందికి కలెక్టర్ సన్మానించి మెమెంటోలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి విజయశంకర్‌రెడ్డి, కార్యాలయపు సిబ్బంది, మాజీ సైనికులు పాల్గొన్నారు.

## ఒలంపిక్ క్రీడలపై విస్తృతంగా ప్రచారం : కలెక్టర్



చిత్తూరుటౌన్, జూలై 26 ప్రభాతవార్త: ఒలంపిక్ క్రీడల గురించి విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం ఈ నెల 26వ తేదీ ప్యారిస్‌లో ప్రారంభం కానున్న 30వ ఒలంపిక్ క్రీడా పోటీలను పురస్కరించుకుని అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సెల్ఫీ, స్టాండీస్‌తో ఫోటోలు తీసే కార్యక్రమంను కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రారంభించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి బాలాజీ, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నేడు సఫాయి కర్మచారీ అమలు చట్టం కమిటీ సమావేశం

చిత్తూరుటౌన్, జూలై 26 ప్రభాతవార్త: కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సఫాయి కర్మచారీ చట్టం అమలుపై జిల్లా సఫాయి కర్మచారీ నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరుగనుందని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమం, సాధికారత అధికారిణి డాక్టర్ జి.రాజ్యలక్ష్మీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా సఫాయి కర్మచారీ నిఘా, పర్యవేక్షణ కమిటీ సభ్యులందరు హాజరు కావాలని ఆమె కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆషాడం పూజలు

చౌడేపల్లి, జూలై 26 ప్రభాతవార్త : స్థానిక కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఆషాడ మాసం శుక్రవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. వాసవీ– వనితాక్లబ్ ఆధ్వర్యంలో ఉదయాన్నే వేదపండితులు అమ్మవారికి విశేషాభికం,గోరింటాకుతోఅలంకరణగావించారు.వనితాక్లబ్‌మహిళలుఅమ్మవారిఉత్సవ మూర్తిని వివిధరకాలపూలతోసర్వాంగసుందరంగాఅలంకరించారు.వాసవీ–వనితాక్లబ్‌సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఇక క్యూఎల్ఇడిలదే హవా : ఎస్ఆర్



పుంగనూరు, జూలై 26 ప్రభాతవార్త : ఇక రాబోయే తరాలన్నింటికీ వినోదం కోసం ప్రతి ఇంటిలోనూ క్యూఎల్ఇడి టీవీలే ప్రధానం కాబోతున్నాయని ఎస్ఆర్ డిష్ అధినేత సిఎస్ రాజారెడ్డి స్పష్టం చేశారు. బెంగళూరులో జరిగిన బిపిఎల్ దక్షిణభారత పంపిణీదారుల సమావేశంలో ఆయన క్యూ ఎల్ఇడి టీవీలను పరిచయం చేశారు. ఆయన మాట్లాడుతూ తొలి టీవీలను తయారుచేసిన బిపిఎల్ సంస్థ ఇపుడు అందుబాటులోనికి తెస్తున్న క్యూఎల్ఇడి టీవీలు మంచి మన్నిక,తక్కువ ధరతో పాటూ పలుసేవలందిస్తాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో అందుబాటులోనికి వస్తున్న ఈరకం టీవీలకు మంచి ఆదరణ ఉంటుందన్నారు.

## ఘనంగా కార్గిల్ విజయ్ దివాస్



చిత్తూరురూరల్, జూలై 26 ప్రభాతవార్త: చిత్తూరుపట్టణం, పివికెయన్ ప్రభుత్వ కళాశాల నందు కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.పి. జీవన్‌జ్యోతి మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో మరణించిన వీరజవానుల త్యాగాలను స్మరించుకొంటూ ప్రతి విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకోవాలని, ఆసక్తి కలిగిన విద్యార్థులు సైన్యంలో చేరి దేశానికి సేవలందించాలని పిలుపునిచ్చారు. అలాగే సేవాభారతి సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెప్ప, హరీష్‌లు భారతీయ సైనికుల ధైర్యసాహసాలను, పోరాటపటిమల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డా. మీరాసాహెబ్, అధ్యాపకులు చెన్నకేశవులు, రాజేష్‌కుమార్, రెడ్డిభాషా. విద్యార్థులు, సేవాభారతి సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ యాప్ మోసాలపై కొనసాగుతున్న ఫిర్యాదులు

–సిఐకు ఫిర్యాదు చేసిన గ్రూపు మహిళలు

పలమనేరు,జూలై 26 ప్రభాతవార్త: ఆన్‌లైన్ యాప్ మోసాలపై ఫిర్యాదుల పర్వ కొనసాగుతుంది.గత వారం రోజులుగా ఓ ఆన్‌లైన్ యాప్ ద్వారా అధిక వడ్డీలు వస్తుందని ఆశపడి ఆ యాప్‌లో నగదు జమచేసిన వారికి ఆ యాప్ నిర్వహకులు ఒక్కసారిగా బోర్డుతిప్పేయడంతో ఆ యాప్‌లో నగదు చెల్లించిన వారు వారి ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు.ఈ మేరకు పట్టణానికి చెందిన కొందరు మహిళలు పలమనేరుకు చెందిన ఆర్పీలు తమకు ఆశచూపి ఆ యాప్‌లో నగదు చెల్లింపులు చేయించారని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న కొందరు ఆర్పీలు,గ్రూపు సభ్యులు దాయ్ అన్‌లైన్ యాప్ నందు తక్కువ పెట్టుబడితో ప్రతి రోజు 10శాతం వడ్డీతో అధిక లాభాలు వస్తున్నాయని నమ్మించి మా వద్ద పెట్టుబడులు పెట్టించారని తీరా ఆ యాప్ పని చేయడం లేదని మేము చెల్లించిన నగదు చూపడం లేదని తెలిపినా వారు స్పందించలేదని ఆర్పీలు,గ్రూపు సభ్యుల సూచనలమేరకే తాము ఆ యాప్‌లో నగదు జమచేయడం జరిగిందని తెలిపారు. వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని సిఐను కోరారు.ఈ మేరకు సిఐ మాట్లాడుతూ నానాటికి ఆన్‌లైన్ మోసాలు అధికంగా జరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఆన్‌లైన్ మోసాలపై అవగాహన పెంచుకోవాలని ఏప్పటికప్పుడు సూచనలు,అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నపట్టికి ప్రజలు అవగాహన లేకుండా ఇలాంటి తెలియని యాప్‌లలో నగదు పోగొట్టుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామని ఆయన తెలిపారు.

## పూలే విగ్రహ ఏర్పాటుకు కార్యాచరణ

వి.కోట,జూలై 26 ప్రభాతవార్త: భారతదేశ దిశ దశ మార్చేలా..బడుగుల జీవితాల్లో వెలుగు నింపేలా... జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు మహత్మ జ్యోతి రావు పూలే విగ్రహాన్ని వి.కోట పట్టణ నడిబొడ్డున ఏర్పాటు చేసేందుకు బహుజన కార్యచరణ సమితి శ్రీకారం చుట్టామని బహుజనుల కార్యచరణ సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు నాగభూషణం, సోమశేఖర్, రామూర్తి,విశ్వనాథ్,తుకారం మరియు దళిత నాయకులు బాస్ గణపతి, బాస్ దొరస్వామి,బీఎస్పీ శ్రీనివాసులు,వి సీ కే పార్టీ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## మధ్యాహ్న భోజనం తనిఖీ



కోట, జూలై 26 ప్రభాతవార్త : కోట మండలం చెందోడు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఎంఇఓ మస్తానయ్య మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారమే భోజనం పెడుతున్నారని విద్యార్థులు చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు.

## గర్భిణిపై భర్త, బంధువులు దాడి!

కోట, జూలై 26 ప్రభాతవార్త: కోట మండలం రుద్రవరం గ్రామానికి చెందిన యల్లసిరి కోటేశ్వరిపై ఆమె భర్త సమీర్, అత్త మంజులమ్మ, బంధువులు సౌందర్య, సుల్తాన్, మరికొందరు దాడి చేసి గాయపరిచినట్లు బాధితురాలు తెలిపింది. శుక్రవారం తన పుట్టినిల్లయిన గూడలి కొత్త అరుంధతీయవాడకు వచ్చి తన తల్లి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో అదనపు కట్నం తేలేదని వారు వచ్చి మూకుమ్మడిగా దాడి చేయడంతో ఆసుపత్రి పాలయింది. ఆ మేరకు కోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## వ్యవసాయ సీజన్‌కు ముందు గ్రామదేవతలకు పొంగళ్లు

తడ, జూలై 26 ప్రభాతవార్త :



వర్షాలు మొదలు కావడంతో వ్యవసాయం పనులు ప్రారంభించే రైతన్నలు పల్లెల్లో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు మొదలుపెట్టారు. తడ పల్లెల్లో పలు పేర్లతో గ్రామదేవతలు కొలువై ఉన్నారు. పోలేరమ్మ, ముత్యాలమ్మ, చల్లాతమ్మ, చెంగాళమ్మలను కొలుస్తూ వర్షాలు బాగా కురవాలని, పంటలు పండాలని కోరుకుంటారు. ఇందులో భాగంగా గత మూడు వారాలుగా ప్రతి పల్లెలోను ఏదో ఒక గుడిలో పూజలు చేస్తున్నారు. శుక్రవారం, ఆదివారం రోజుల్లో పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ కావడంతో ఈ శుక్రవారం కూడా పలుచోట్ల మహిళలు పొంగళ్లు పెట్టారు. వాటంబేడులో ఇటీవల విగ్రహ ప్రతిష్ఠ జరుపుకున్న పోలేరమ్మ ఆలయం ముందు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

## దొడ్లవారిమిట్టలో ఉపాధి హామీ గ్రామసభ

పెళ్లకూరు, జూలై 26 ప్రభాతవార్త :



పెళ్లకూరు మండలం జీలపాటూరు గ్రామ పంచాయతీ పరిధిలోని దొడ్లవారిమిట్ట గ్రామంలో శుక్రవారం మహాత్మాగాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రోజ్‌గారి దివాస్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఫేర్ ఫుట్ టెక్నీషియన్ సంక్రాంతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఉపాధి హామీపనికి రావాలని కోరారు. పనికి వచ్చే ప్రతి ఒక్కరు రోజుకు సరాసరి వేతనం రూ.300 వచ్చే విధంగా పనిచేయాలని తెలిపారు. ముఖ్యంగా రైతులకు ఉపయోగపడే హార్టికల్చర్, పంట కాలువలు, వరవకాలువలు పని చేసుకోవాలని తెలియజేశారు. ఈ సమావేశంలో క్షేత్ర సహాయకుడు గుండాల సుబ్రహ్మణ్యం, మేట్లు, ఉపాధి హామీ వేతనదారులు పాల్గొన్నారు.

## ఇంటి స్థలాలు కబ్జా చేస్తున్నట్లు ఫిర్యాదు

బాలాయపల్లి, జులై 26 ప్రభాతవార్త



మండలంలోని మేల్చూరు గ్రామంలో ఇంటి స్థలాలను కొందరు కబ్జా చేస్తున్నట్లు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. 1985 సంవత్సరంలో దళితులకు వీటిని కొందరు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నట్లు ఎంఆర్‌పిఎస్ నాయకులు శ్రీనివాసులు స్థానికులు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్య తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు.

## పదోతేదీ నుండి వంతెన పై వాహనాల రాకపోకలు : డిఈ

బాలాయపల్లి, జులై 26 ప్రభాతవార్త :



ఆగస్టు నెల పదవ తేది నుండి బాలాయపల్లి గూడూరు మార్గమధ్యలోని నేరేడు కాలువ వంతెనపై వాహనాల రాకపోకలు జరుగుతాయని క్వాలిటీ కంట్రోల్ డిఈ అశ్విని కుమార్ తెలిపారు. 39 లక్షల రూపాయిలు ఎంపి నిధులతో నిర్మించిన బ్రిడ్జి నిర్మాణ పనులను క్వాలిటీ కంట్రోల్ డిఇ అశ్విని కుమార్, ఏఈలు శివప్రసాద్, సుబ్రమణ్యం పరిశీలించారు. ఆగస్టు నెల 10వ తేదీ నుండి వంతెన పై రాకపోకలు ప్రారంభం అవుతాయని ఆయన వివరించారు. వర్షాకాలంలో నేరేడు కాలువ పొంగి ప్రవహిస్తున్నందువల్ల రాకపోకలు స్తంభించావని వంతెన నిర్మాణంతో ఐదు గ్రామాలకు లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు. అలిమిలి వన్నూరు పల్లిపాడు జయంపు, గొల్లపల్లి యాత్ర గ్రామాలకు వంతెన ఎంతకాలం ఉపయోగపడుతుంది.

## ఆగస్టు 15న అన్నా క్యాంటీన్ ప్రారంభం

వెంకటగిరి, జులై 26 ప్రభాతవార్త :



ఆగస్టు నెల 15వ తేది రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్‌లను ప్రారంభించాలని నిర్ణయించడంతో వెంకటగిరిలో క్యాంటీన్ పనులు జోరుగా సాగుతున్నాయి. మున్సిపాలిటీ డిఈ శ్రీధర్, టిడిపి నాయకులు పరిశీలించారు. ఆరున్నర లక్షల రూఁపాయిలతో గతంలో ఉన్న అన్నా క్యాంటీన్‌లో మరమ్మతులు చేసి సిద్ధం చేస్తున్నట్లు డిఈ శ్రీధర్ తెలిపారు. అన్నా క్యాంటీన్ పునర్నిర్మాణ పనులకు 10 లక్షల రూపాయిలు వరకు ఖర్చు చేసుకోవచ్చని ఆయన చెప్పారు. చింతపట్ల మురళినాయుడు పేరుతో అన్నా క్యాంటీన్ పనులను టెండర్ల ద్వారా దక్కించుకున్నట్లు తెలిపారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వర రావు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చలికం మధురెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు గొల్లగుంట వెంకటముని పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నా క్యాంటీన్ 15వ తేది ప్రారంభిస్తారని నాయకులు తెలిపారు.

## నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వాలి : ఎమ్మెల్యే



వెంకటగిరి, జులై 26 ప్రభాతవార్త : నియోజకవర్గంలో ఆగి వున్న నీటి పారుదల శాఖ పనులకు నిధులు ఇవ్వాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కోరారు. ఆల్తూరుపాడు రిజర్వాయర్, సోమశిల స్వర్ణముఖి లింకు కెనాల్‌కు నిధులు కావాలని కోరారు. నియోజకవర్గంలో ఇంకా పలు అభివృద్ధి పనులకు కావాల్సిన నిధుల విషయమై మంత్రికి వినతి పత్రం అందజేశారు. స్పీకర్‌గా ఎన్నికైన అయ్యన్నపాత్రులకి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. అసెంబ్లీ సందర్భంగా పలువురు మంత్రులను ఎమ్మెల్యే కలిసి నియోజకవర్గం అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరారు.

## ఉపాధ్యాయులపై పెట్టిన కేసులు ఎత్తివేస్తానని ప్రకటించడం హర్షనీయం

బాలయపల్లి, జులై 26 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శాసనసభ సమావేశాలలో సిపిఎస్ ఉద్యమం పిఆర్సి ఉద్యమాలలో పాల్గొన్న ఉద్యోగ ఉపాధ్యాయుల మీద గత ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసులను రద్దు చేస్తాను అని ప్రకటించడం పట్ల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు కె. రమేష్ బాబు హర్షం ప్రకటించారు. అదే విధంగా విద్యా శాఖ మంత్రి లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జీవో నెంబర్ 117ని రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను పరిరక్షించాలని కోరారు. ఒకటి, రెండు తరగతులు మాత్రమే ప్రాథమిక పాఠశాలలో మిగిలినందున వారు కూడా ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గుచూపుతున్నారు. కాబట్టి తక్షణం 117 జీవో రద్దు చేయాలని కోరారు.

## ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో అమర జవానులకు నివాళి

తిరుపతి విద్య, జులై 26 ప్రభాతవార్త : భారతదేశం కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్ పై విజయం సాధించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానంల ఆధ్వర్యంలో నిర్వహించే స్థానిక బాలాజీ కాలనీలో ఉన్న ఎస్‌వి ఆర్ట్స్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివాస్ రాజతోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్గిల్ యుద్ధ సమయంలో భారత సైనికులు ప్రతికూల పరిస్థితులను అధిగమించి, తమ ప్రాణాలను తెగించి మన దేశ సైనికుల పోరాటం అసామాన్యమని, అనితరసాధ్యమని పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం కార్గిల్ యుద్ధంలో విరోచితంగా పోరాడి వీరమరణం పొందిన అమర జవానులకు అనంతరం ఘనంగా అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. భాస్కరుడు, డాక్టర్ ఎన్ భీమన్న, ఎన్‌సిసి అధికారి కెప్టెన్ బి. రమేష్, డాక్టర్ వై. మల్లికార్జున రావు, ఎన్‌సిసి విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## హోం మంత్రిని సన్మానించిన రాష్ట్ర మహిళా కార్యదర్శి

చిల్లకూరు, జులై 26 ప్రభాతవార్త



రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, శాసనసభ్యులు, హోం శాఖ మంత్రి వంగలపూడి అనితని విజయవాడ నగరంలోని బందర్ రోడ్డు వద్ద మురళీ ఫార్చ్యూన్ హోటల్ నందు రాష్ట్ర మహిళా కార్యదర్శి లీలావతి మర్యాదపూర్వకంగా కలిసారు. రాష్ట్ర మహిళ కమిటీ సభ్యులతో పాటు రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి ఘనంగా శాలువా పూలమాలతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో మహిళలకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. మహిళలకే హోంశాఖ మంత్రి పదవి ఇవ్వడం మహిళా లోకానికి గర్వకారణం అన్నారు. మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ప్రతి ఒక్కరూ మహిళా సాధికారతకు తోడ్పడాలని పేర్కొన్నారు.

## ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



వెంకటగిరి, జులై 26 ప్రభాతవార్త : ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఓ. అనూష తెలిపారు. వెంకటగిరి భారతీయ చేనేత సంస్థలు న్యాయవిజ్ఞాన చైతన్య సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా వచ్చిన చట్టాలు కూడా అందరూ తెలుసుకోవాలని సూచించారు. ర్యాగింగ్ పాల్పడే విద్యార్థులు పై కూడా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చట్టాలపై అవగాహన ఉంటే నేరాలకు పాల్పడదని తెలిపారు. విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. సిఐ సంగమేశ్వర రావు, ఎస్ఐ జిత్యా నాయక్, న్యాయవాదాలు రాజేష్, రాజారావు, రెంటాల వాసు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం ఆర్డీఓగా కొండూరు శ్రీనివాసులు రాజు నియామకం

కుప్పం, జూలై 26 ప్రభాతవార్త : కుప్పం రెవెన్యూ డివిజన్ అధికారిగా కొండూరు శ్రీనివాసులు రాజును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కొండూరు శ్రీనివాసులు రాజు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్నారు. కుప్పం ఆర్డీఓగా పనిచేసిన గోపాలి శ్రీనివాసులును ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి వద్ద రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. రెండు మూడు రోజుల్లో నూతన ఆర్డీఓ బాధ్యతలు తీసుకుంటారని తెలిసింది.

## కుప్పం పట్టణ పరిశుభ్రతకు వ్యాపారులు.. ప్రజలు సహకరించాలి

కుప్పం,జూలై 26 ప్రభాతవార్త :



కుప్పం పట్టణ పరిశుభ్రతకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక పూలమార్కెట్ వద్ద మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావుతో కలసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా పి.డి. మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యాపారులు, దుకాణదారులు ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలను పడేయరాదని సూచించారు. మున్సిపల్ కార్మికులే నేరుగా చెత్త సేకరణకు వస్తారని వారికి చెత్తను అందజేయాలన్నారు. అలాగే పట్టణంలో ప్రధాన రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా దుకాణాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కుప్పం హౌసింగ్ డిఇగా సుబ్రమణ్యం



కుప్పంరూరల్, జూలై 26 ప్రభాతవార్త : కుప్పం గృహ నిర్మాణ శాఖ డిఇగా సుబ్రమణ్యం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పూతలపట్టు డివిజన్‌నుంచి బదిలీ అయ్యారు. గతంలో సైతం సుబ్రమణ్యం కుప్పంలో డిఇగా విధులు నిర్వహించారు. కుప్పం డిఇ ఇటీవలే పదవీ విరమణ పొందారు. ఈసందర్భంగా ఆయన కడ పి.డి. వికాస్ మర్మత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం

శ్రీకాళహస్తి, జూలై 26 ప్రభాతవార్త : కార్గిల్ యుద్దంలో దేశంకోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లను స్మరించుకుంటూ వారికి నివాళులు అర్పిస్తూ దివస్ 25వ వార్షికోత్సవాన్ని శ్రీకాళహస్తిలోని కార్గిల్ సెంటర్ నందు మాజీ సైనికుడు పులిశ్రీకాంత్, న్యాయవాది పులి పుష్పలతల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా పురపాలక కమిషనర్ రమేష్‌బాబు పాల్గొని పాఠశాల విద్యార్థులు, మాజీ సైనికులతో కలసి దేశ రక్షణకోసం ప్రాణాలర్పించిన వీరజవాన్లకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి కొట్టేసాయి,మాజీ సైనికులు జనార్ధన్, సుబ్బారెడ్డి, నరసింహులు, కిషోర్‌నాయుడు, డిల్లీ, వివేకానంద పాఠశాల హెచ్ఎం జితేంద్ర, అల్లంమణి, శ్రీనివాసులు విద్యార్థులు, మహేష్, పులినాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రుయా పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

**-సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్**



తిరుపతి హెల్త్, జులై 26 ప్రభాతవార్త : రుయా హాస్పిటల్‌లో పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాధాకృష్ణ నాయకత్వంలో కార్మిక ప్రతినిధి బృందం కలిసి సమస్యలపై వివరించారు. కలెక్టర్ సానుకూలంగా ప్రతి సమస్యను అడిగి వివరాలు తెలుసుకున్నారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ రుయా ఆసుపత్రి, స్విమ్స్, మెటర్నటీ, స్విమ్స్ వైద్య కళాశాలలోని పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పై అనేక సందర్భాలలో గతంలో కూడా కలెక్టర్ దృష్టికి, డిఎంహెచ్ఓ దృష్టికి పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను అనేక సార్లు తీసుకెళ్లినా పట్టించుకో లేదని ఆవేదన వ్యక్తం చేసారు. జిల్లా కలెక్టర్ సమస్యలపై సానుకూలంగా స్పందించి అడిగి తెలుసుకోవడం చూస్తుంటే సమస్యల పరిష్కారం అవుతాయని నమ్మకాన్ని కలిగించిందని ఆయన అన్నారు. రుయా హాస్పిటల్‌లో ఏవన్ కాంట్రాక్టర్ 230 మంది కార్మికులు పనిచేయవల్సిన చోట 90 మందితో పని చేయించుకుంటూ కార్మికులపై విపరీతమైన పని భారం మోపుతూ ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించకుండా అడిగితే కార్మికులు మధ్య తగాదాలు పెడుతూ అధికారుల మాటలను సైతం లెక్కచేయకుండా అధికారులకు లంచాలు ఇస్తున్నాను నన్నెవరు అడిగేది అన్న రీతిలో బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. కలెక్టర్ స్పందిస్తూ చిరు కార్మికులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోనని, కార్మికులకు కార్మిక నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శులు, సిహెచ్ శివకుమార్, వైఎస్ మణి, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మహేంద్ర, పారిశుద్ధ్య కార్మికుల నాయకులు, సునీల్ జ్యోతి రమాదేవి, బుజ్జమ్మ, మంజుల దేవి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా నైపుణ్యాభివృద్ధి ప్రణాళికను రూపొందించండి : కలెక్టర్



తిరుపతి కార్పొరేషన్, జులై 26 ప్రభాతవార్త : జిల్లాలో యువతకు ఉపాధి కల్పించే దిశగా జిల్లా నైపుణ్యాభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర జిల్లా వృత్తి నైపుణ్య అభివృద్ధి కమిటీ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మిని కాన్ఫిరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ జిల్లా వృత్తి నైపుణ్య అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికల గురించి చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువత వారు కోరుకుంటున్న రంగంలో దానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించి, వారికి ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలో డిమాండ్ ఉన్న కోర్సులను గుర్తించాలని పరిశ్రమలు, ఎంప్లాయి మెంట్, డిఆర్‌డిఏ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని భారీ, మధ్య, చిన్న తరగతి పరిశ్రమలలోని అవకాశాలను ఇది వరకే గుర్తించిన అవకాశాలను యువతకి జాబ్ మేళాల ద్వారా ఇండస్ట్రీ కస్టమైజ్డ్ స్కిల్ ట్రైనింగ్ ద్వారా ఉపాధి కల్పించవల్సిందిగా సూచించారు. జిల్లాలోని ఉన్న ఇతర పెద్ద పరిశ్రమలను , కంపెనీలను వ్యాపార సంస్థలను సంప్రదించి, వారి అవసరాల కనుగుణంగా జిల్లాలో ఉన్న నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇప్పించి, వారికి ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, ఇంజనీరింగ్ కోర్సులు చేసిన వారిని గుర్తించి వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో డిస్ట్రిక్ స్కిల్ డెవలప్మెంట్ కమిటీ కన్వీనర్ డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభావతి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్ రెడ్డి, జడ్‌ఎం ఎపిఐఐసి, రీజనల్ స్కిల్ డెవలప్మెంట్ అధికారి, ఎన్ శ్యామ్మోహన్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం, శ్రీ పద్మావతి యూనివర్సిటీ, ప్రతినిధులు, ఎల్డిఎం విశ్వనాథ రెడ్డి, ఎడి న్యాక్ సతీష్ చంద్ర, మెప్మా ప్రతినిధి కృష్ణవేణి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి, గోపీకృష్ణ, ఐటిఐ, పాలిటెక్నిక్ కన్వీనర్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సంక్షేమ శాఖ, కార్పొరేషన్ ప్రతినిధులు, ఏపీఎస్ఎస్డిసి, సీడ్ యాప్, ట్రైనింగ్ ఇన్స్టిట్యూషన్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

**శివయ్య పాలన పగ్గాలు...**

# బొజ్జలను నమ్ముకున్న రంగినేనికే!



శ్రీకాళహస్తి,జూలై 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని నమ్ముకొని ఉన్న నాయకులకు నామినేటెడ్ పదవుల పందారానికి శాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ నేపధ్యంలో శుక్రవారం ఎంఎల్ఏ మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యంత కీలకమైనది, పరిపాలనలో ప్రభావం చూపే నామినేటెడ్ పదవి శ్రీకాళహస్తీశ్వరుని పాలక పగ్గాలు. ఇక్కడి పాలన ప్రభావం ఎన్నికల్లో ఎంతో ఉంటుంది. అలాంటి కీలకమైన పదవిలో తమకు నమ్మకమైన నాయకుడు ఉండాలని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి భావించినట్లు ఉంది.

**పార్టీలో ఉంటూ పార్టీ కోసం పాటుపడుతూ :**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పార్టీ కష్టకాలంలో పార్టీలో ఉంటూ బొజ్జల కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉంటూ గోపాలకృష్ణారెడ్డి ఉన్నప్పటి నుంచి ఆ కుటుంబానికి నమ్మిన బంటుగా ఉన్న రంగినేని చెంచయ్య నాయుడుకు ఈ సారి అత్యంత కీలకమైన శ్రీకాళహస్తీశ్వరుని ధర్మకర్తల మండలి పాలక పగ్గాలు లభించుట దాదాపు ఖాయమైందని చెప్పవచ్చు.ఆది నుంచి పార్టీని నమ్ముకున్న వారికి నామినేటెడ్ పదవుల్లో మొదటి పీట వేయాలని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి భావించారు. చెంచయ్య నాయుడు ఆది నుంచి పార్టీలో ఉంటూ తన పంచాయతీల్లో పార్టీని తిరుగులేని విధంగా నడుపుతు న్నారు. గోపాలకృష్ణారెడ్డి హయాంలో రంగినేని చెంచయ్యనాయుడు శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్‌గా సమర్థవంతంగా పని చేసారు. తరువాత గత ఐదేళ్ళలో ఆయన బొజ్జల సుధీర్‌రెడ్డి అనుచరుడుగా ఉంటూ పోలీసు కేసుల్లో నమోదయ్యారు. ఈ అంశాలను శుక్రవారం ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ఎంఎల్ఏ కలిపినపుడు వివరించినట్లు తెలిసింది. శ్రీకాళహస్తీశ్వ రాలయ పగ్గాలను 'చెంచయ్యనాయుడుకు' అప్పగించుటకు కారణాలను ఎంఎల్ఏ స్థానిక నాయకులకు కూడా వివరించినట్లు సమాచారం. అన్ని విన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రంగినేని చెంచయ్య నాయుడును అభినందించి ఆశీర్వదించినట్లు కూడా తెలిసింది. శ్రీకాళహస్తీశ్వరుని పరిపాలనా పగ్గాలు దాదాపు రంగినేని చెంచయ్యనాయుడుకు ఖరారు అయినట్లే అని సమాచారం.

# కార్గిల్ విజయ దివాస్ అమరులకు నివాళి



కోట, జులై 26 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సిసి క్యాడెట్లు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి కార్గిల్ అమర వీరులకు నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి రక్షణకవచంగా సైనికులు నిత్యం అప్రమత్తంగా ఉండి శత్రు దేశాల నుంచి ప్రజలను కాపాడుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటాలని, భారత సైనికులను గౌరవించాలని ఆకాంక్షించారు. కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు వీరోచితంగా పోరాడి శత్రువులను తరిమికొట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ మల్లికార్జునరెడ్డి, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

# రేణిగుంట ప్రజల దాహార్తి తీర్చిన ఎమ్మెల్యే బొజ్జల



రేణిగుంట, జూలై 26 ప్రభాతవార్త: రేణిగుంట ప్రజలకు తెలుగు గంగ నీటిని అందించి ప్రజల దాహార్తి తీర్చడానికి కృషి చేసిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని రేణిగుంట వాసులు అపర భగీరథునిగా ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. శ్రీకాళహస్తిలో కండలేరు రిజర్వాయర్ నుంచి వస్తున్న తెలుగు గంగ నీటిని పైపులైన్ల ద్వారా రేణిగుంట సంపుకు సరఫరా చేయడానికి శుక్రవారం ఎంపీడీవో విష్ణు చిరంజీవి, పీవోపీఆర్‌డీ వెంకటరత్నమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పవన్‌కుమార్, రేణిగుంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టీడీపీ సీనియర్ నేతలు డి.పుష్పనాథం, కన్నన్‌రెడ్డి, నాధమునిరెడ్డి సమక్షంలో మీట నొక్కి ప్రారంభించారు. మాజీ మంత్రి టీడీపీ సీనియర్ నాయకులు దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి రేణిగుంట వాసుల దాహార్తి తెలుగు గంగ నీటి ద్వారా తీర్చడానికి సుమారు 35 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించారు. శ్రీకాళహస్తి నుంచి రేణిగుంట వరకు అప్పట్లో తెలుగు గంగ పైపులైన్లు వేశారు. అనంతరం సమస్య సమస్యగానే మిగిలిపోయింది. రేణిగుంట వాసులు నీటి కోసం పడుతున్న ఇబ్బందులను తెలుగు గంగ పైపులైను విషయాన్ని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆయన సతీమణి రిషితారెడ్డికి టీడీపీ నేతలు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, మునిచంద్రారెడ్డి, మహబూబ్ బాషా, డి.పుష్పనాథం, జీకే మునీర్, నవాబ్, తదితరులు వివరించారు. తక్షణం స్పదించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను పరుగులు పెట్టించి యుద్ధ ప్రాతిపదికన రేణిగుంట కండలేరు రిజర్వాయర్ నుంచి వస్తున్న తెలుగు గంగ నీటిని రేణిగుంటకు సరఫరా చేయాలని ఆదేశించారు. దీంతో స్పందించిన అధికారులు టీడీపీ నేతలతో కలసి మీటనొక్కి పైపులైన్ల ద్వారా తెలుగు గంగ నీరు రేణిగుంట ప్రధాన సంపుకు చేరే విధంగా ప్రణాళికలు చేపట్టారు. శనివారం నుంచి రేణిగుంట వాసుల దాహార్తి తెలుగు గంగ నీరు తీర్చనున్నది.

# తప్పనిసరిగా భూసార పరీక్షలు చేసుకోవాలి : ఏడిఏ



వెంకటగిరి, జులై 26 ప్రభాతవార్త : భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా రైతులు ఎరువులు వాడి, సాగు ఖర్చులు తగ్గించుకొని, అధిక దిగుబడులు పొందవచ్చునని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడిఏ భాస్కరయ్య తెలిపారు. పెట్లూరు గ్రామంలో ఆత్మ సహకారంతో భూసార పరీక్షలు, ఎరువుల వినియోగం పై రైతులకు ఆయన శిక్షణ ఇచ్చారు. భూసార పరీక్ష ఫలితాలను బట్టి అవసరమైన వరకే ఎరువులు వాడకం వలన ఖర్చు తగ్గుతుందని తెలిపారు. పంటల అవసరాలకు సరిపడే ఎరువులు వాడకం వలన దిగుబడులు పెరుగుతాయని వివరించారు. వ్యవసాయ శాఖ రైతులకు భూసార పరీక్షలు ఉచితంగా చేస్తుందని, ఈ అవకాశాన్ని రైతుల వినియోగించు కోవాలని కోరారు. వెంకటగిరి డివిజన్ ఏడిఏ నాగార్జున సాగర్ వరి సాగులో చేపట్టాల్సిన మేలైన ఎరువులు యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. నెలల ఆరోగ్యం పెంచేందుకు వ్యవసాయ శాఖ రాయితీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను వినియోగించుకోవాలని రైతులను ఆయన కోరారు. జిల్లా వనరుల కేంద్రం ఏ.ఓ వేణుగోపాల రావు వరిలో పాటించాల్సిన సస్య రక్షణ చర్యలు, కలుపు నివారణ గురించి వివరించారు. వరిలో నాటిన మూడు వారాల తర్వాత కలుపు మందుల వినియోగం వలన ఫలితం ఉండదని తెలిపారు. మండల వ్యవసాయ శాఖ అధికారి సుజాత, రైతులకు వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవల గురించి వివరించి వాటిని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు గ్రామ వ్యవసాయ సహాయకురాలు వరలక్ష్మి, టీవీఎస్ ట్రస్ట్ సభ్యులు సతీష్, కేశవ పాల్గొన్నారు.

# తిరుపతి గంగమ్మ తల్లిని దర్శించుకున్న భువనేశ్వరి



కుప్పం, జూలై 26 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి శుక్రవారం జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమాంబ అమ్మవారిని దర్శించుకు న్నారు. నారా భువనమ్మకు ఆలయ అర్చకులు పూర్ణకుంభస్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం హారతి, తీర్థప్రసాదాలు, అమ్మవారి శేష వస్త్రాన్ని అర్చకులు నారా భువనమ్మకు అందజేశారు. నారా భువనమ్మను చూసేందుకు మహిళలు ఆలయం వద్ద ఎగబడ్డారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నగరి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

**-పవన్‌కల్యాణ్‌కు భానుప్రకాశ్ విజ్ఞప్తి**



పుత్తూరు, జూలై 26 ప్రభాతవార్త : నగరి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని డిప్యూటీ ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అసెంబ్లీలో ఉప ముఖ్య మంత్రిని ఆయన కలిశారు. నియోజ కవర్గం లోని మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలని కోరారు. నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లు దుస్థితిలో వున్నాయని, పలు గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నెలకొందన్నారు. రోడ్ల మరమ్మతు, మంచినీటి సదుపాయాల ఏర్పాటుకు నిధులిచ్చి అభివృద్ధికి సహకరించాలని తెలిపారు.

# సిపిఎస్‌కేసుల రద్దు ప్రకటన హర్షణీయం

**-జిల్లా ఎస్టీయు కార్యదర్శి మోహన్**



పుంగనూరు, జూలై 26 ప్రభాతవార్త : గత ప్రభుత్వం సిపిఎస్ రద్దును నిర్లక్ష్యం చేసిందని, ఉద్యమాలు చేసిన వారిపై కేసులు పెట్టిందని, ఆకేసులను రద్దుచేస్తామని సిఎం చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమని జిల్లా ఎస్టీయు కార్యదర్శి మోహన్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పుంగనూరులో జరిగిన ఎస్టీయు ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంతకాలం ఉపాధ్యాయులను, సిపిఎస్ టీచర్లను మభ్యపెట్టిన ప్రభుత్వం దిగిపోయిందని, ఉపాధ్యాయులను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వానికి ఉపాధ్యాయ,ఉద్యోగ వర్గాలు బుద్దిచెప్పిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. అయితే, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సిపిఎస్ ఉద్యమాల కేసులను రద్దుచేయడానికి ప్రకటన చేయడం ప్రభుత్వానికి ఉద్యోగులపై ఉన్న చిత్తశుద్దికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎస్టీయునాయకులు,సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మంత్రిని కలిసిన నగరపాలక సంస్థ కమిషనర్ నారపురెడ్డి మౌర్య



తిరుపతి కార్పొరేషన్, జులై 26 ప్రభాతవార్త : రాష్ట్ర మంత్రి నారాయణని అమరావతిలో మర్యాదపూర్వకంగా తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ నారపురెడ్డి మౌర్య కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజే సారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్ కమి షనర్లతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ నారపురెడ్డి మౌర్య తిరుపతి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గుర్చి, చేయాల్సిన అభివృద్ధిని మంత్రికి వివరించారు.

# ప్రజల సౌకర్యం కోసం ఆక్రమణలు తొలగింపు

తిరుపతిటౌన్, జులై 26ప్రభాతవార్త: తిరుపతి నగరం పరిసరాల్లో ప్రజలకు అసౌకర్యం కలిగించేలా, రోడ్లు ఆక్రమించుకుని పలురకాల వ్యాపారాలు వున్న వాటిని తిరుపతి పోలీసులు తొలగించారు. ప్రజలకు సౌకర్యంగా వాహనాలు వెళ్ళేలా, పాదచారులు కదిలేలా జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాలతో డిఎస్పీ రవిమనోహర చారి సూచనలతో ఈస్టు సిఐ మహేశ్వరరెడ్డి తమ సిబ్బందితో శుక్రవారం సాయంత్రం బండ్లవీధి, గాంధీరోడ్డు, ఇసుకవీధి, తిలక్‌రోడ్డు ప్రాంతాల్లో రోడ్లు ఆక్రమించుకున్న వాటిని తొలగించారు. ఆక్రమణలు ఉంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

# బహుదూరపు బాటసారి పుస్కకావిష్కరణ



శ్రీకాళహస్తి,జూలై 26 ప్రభాతవార్త : పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో ఉన్న మహిళా డిగ్రీ కళాశాలలో 'బహుదూరపు బాటసారి' పుస్తకావిష్కరణ సభ విజయ వంతంగా నిర్వహించారు. ఇదే కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేసిన డాక్టర్ సుకుమార్‌రెడ్డి లక్షణాలను తెలియజేస్తూ అధ్యాపకులు, మిత్రులు, శిష్యులు వెలువరించిన ఈ పుస్తకావిష్కరణ శోభాయమానంగా జరిగిందని పలువురు అభిప్రాయడ్డారు. సభాధ్యక్షులు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఇలాంటలి అభినందన సంచిక విద్యార్థుల నడుమ ఆవిష్కరించడం విద్యార్థులను ఉత్తేజం చేయడం మరియు స్ఫూర్తిదాయకం అన్నారు. ప్రముఖ శతావధాని ఆముదాల మురళీ మాట్లాడుతూ విద్యార్థులను ఆద్యంతం ఉత్సాహపరిచారు. పుస్తకంలో విద్యార్థుల బాధ్యత యువతకు సందేశం అంతర్లీనంగా ఉండడం గమనార్హం అని పుస్తక సమీక్ష చేసిన గరికపాటి రమేష్ చిన్నవాడైనా పరిశోధక విద్యార్థి అయినా ఎంతో పరిణితితో ప్రసంగించి సభికులను అలరించారు. పుస్తక సమర్పణ ఆచార్య శ్రీనివా సులు మరియు సభేసన్, విశ్రాంత బ్యాంకు మేనేజర్ సుకుమార్‌రెడ్డితో తమ చిన్ననాటి అనుబంధాన్ని స్మృతులను గుర్తు చేసుకున్నారు. సుకుమార్‌రెడ్డి వంటి నిబద్ధత కలిగిన వ్యక్తులు నేటి సమాజానికి అవశ్యకమని తెలిపారు. ప్రముఖ న్యాయవాదులు ప్రత్యేక అతిథి వెంకటస్వామి మాట్లాడుతూ సుకుమార్‌రెడ్డి బాధ్యతాయుతమైన వ్యక్తిత్వాన్ని తన రచనలో పద్యాల్లో సభకు ఆవిష్కరించారు. ఆత్మీయ అతిథి హెడ్‌పోస్టాఫీసు పోస్టుమాస్టర్ వాసంతి మాట్లాడుతూ తన పాత్ర తాలూకు ఆత్మీయతను చాటారు. సుకుమార్‌రెడ్డి నిజంగానే శ్రమిస్తున్న బహుదూరపు బాటసారి అని వారి బాటలో విద్యార్థులు ప్రయాణంచేసి మంచి విద్యార్థులుగా పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాజు, సురేష్, హరి, సత్యనారాయణ, గుణ, వెంకటేష్, పురుషోత్తం, గోవిందయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో అవినీతి జలగలు

**-సామాజిక తనిఖీలో బయటపడ్డ నిజాలు-ఏపీఓతో సహా సిబ్బంది సస్పెండ్**



యర్రావారిపాలెం,జూలై26 ప్రభాతవార్త : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులలో అవినీతి జడలు విప్పింది. సామాజిక తనిఖీలో నిజాలు బయటపడటంతో ఏపీఓతో సహా సిబ్బందిని మొత్తం తిరుపతి డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ సస్పెండ్ చేసిన సంఘటన శుక్రవారం జరిగింది. మండల కేంద్రంలో పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. 2023-24వ సంవత్సరానికి గాను జరిగిన ఉపాధి హామీ పనులలో అనేక అక్రమాలు బయటపడ్డాయి. నిదులు దుర్వినియోగం జరిగినట్లు తెలిపోయింది. దీనితో పీడీ ఉపాధి హామీ పథకం ఏపీఓ ఆశాలత, క్షేత్ర సహాయకులు, కార్యాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశాల ప్రకారం చింతగుంట పీల్డు అసిస్టెంట్ తప్ప మిగిలిన టెక్నికల్ అసిస్టెంట్లు వేమారెడ్డి, సోమయాజు లును మరో 10 మంది సిబ్బందిని అందరిని విధుల నుంచి తొలగించినట్లు ప్రకటించారు. ఈవిషయం మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. త్వరలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. ప్రజాప్రతినిదులు అందరు సహకరించాలని పీడీ కోరారు.

# అత్యాచారం కేసులో భార్యభర్త అరెస్టు

తిరుపతిటౌన్, జులై 26ప్రభాతవార్త: నమ్మకంగా మాయమాటలు చెప్పి ఇంటికి తీసుకెళ్ళి ఆపై శీతలపానీయంలో మత్తుమందుకలిపి మహిళపై అత్యాచారం చేసిన కేసులో భార్యభర్తలను తిరుపతి రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. రూరల్ సిఐ తమీమ్అహమ్మద్ వివరాల మేరకు.... తిరుపతి రూరల్ పుదిపట్లగ్రామానికి చెందిన సదాశివంప్రణవ్‌కృష్ణఅనే ప్రణవ్‌కృష్ణారెడ్డి, వెంకిరెడ్డి కృష్ణకిశోర్‌రెడ్డిలు తిరుపతిలో ఓ ఉద్యోగం చేస్తూ అక్కడ పరిచియం అయిన మహిళను ఇంటికి తీసుకెల్ళారు. అక్కడ ఆమెపై అత్యాచారం చేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు నిందితులు భార్యభర్తను అరెస్టుచేసి రిమాండ్‌కుపంపారు.

# ఆడికృత్తిక ఏర్పాట్లును పరిశీలించిన అధికారులు

**వార్తకు స్పందన**



శ్రీకాళహస్తి,జూలై 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధం గా విజ్ఞానగిరిపై నిర్వహిం చనున్న ఆడికృత్తిక మహోత్సవాల ఏర్పాటును శుక్రవారం ఆలయాధికారులు, ఇంజ నీరింగ్ విభాగం అధికారులు పరిశీలిం చారు. ఈ నెల 28 నుంచి 31 వరకు ప్రధాన ఉత్సవాలు నిర్వహించను న్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లును పరిశీలించారు.గతంలో ఆడికృత్తిక మహోత్సవాలంటే కుమారస్వామి కొండపై ఎంతో సందడిగా ఉండేదని వారం ముందు నుంచి విద్యుత్ దీపాల కాంతితో కళ కళ లాడేదని కానీ ఈ ఏడాది ఉత్సవాలకు సంబంధించి అధికారుల చొరవ చూపటం లేదనే 'వార్త దినపత్రికలో ఊర్లో ఉత్సవాలు: కార్యాలయంలో అధికారులు' అనే శీర్షికతో వార్త ప్రచురితం కావటంతో అధికార గణం కదిలింది.భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా క్యూలైన్లు, ఏర్పాటు చేస్తున్న చలువ పందిళ్ళను మెట్ల మార్గాలను డెప్యూటీ కార్యనిర్వహణాధికారి ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, స్థపతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కొండపై సరసమైన ధరలతో పరిశుభ్ర ఆహారం : టిటిడి ఈఓ



తిరుమల,జులై 26ప్రభాతవార్త : కొండపై భక్తులకు సరసమైన ధరలకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలని, జనతా క్యాంటీన్లు, పెద్దహోటళ్ళు నాణ్యతాప్రమాణాలు మెరుగుపరచాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు పేర్కొన్నారు. ఆగస్టు 5వతేదీ లోపు తిరుమలలోని హోటళ్ళ, ఫాస్ట్‌ఫుడ్ యజమానులు తప్పని సరిగా భద్రత,నాణ్యత ప్రమాణాలు అమలుచేయడంతో బాటు ధరల పట్టికను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. హోటళ్ళలో, క్యాంటీన్‌లలో ఆహారభద్రత ప్రమాణాలు, నాణ్యత విషయంపై సమీక్షించారు.

# అదనపు ఈఓగా...నేడు వెంకయ్యచౌదరి బాధ్యతలు



తిరుమల,జులై 26 ప్రభాతవార్త : ధార్మికసంస్థ టిటిడిలో అదనపుఈఓగా సిహెచ్. వెంకయ్యచౌదరి నేటి ఉదయం బాధ్యతలు చేపట్టనున్నారు. శుక్రవారం సాయంత్రం తిరుపతికి చేరుకున్న ఆయనకు టిటిడి ఉద్యోగులు, ఉద్యోగసంఘాల నాయకులు చీర్లకిరణ్, వంకీపురం పవన్,శ్రీహరిచౌదరి, గుంటూరు రేఖ, మణికంఠ, సునీల్‌కుమార్‌యాదవ్ , ఈశ్వర్‌నాయక్ తదితరులు పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు.

# చిన్న పిల్లలలో అభివృద్ధి వ్యత్యాసాల గుర్తింపు



తిరుపతి హెల్త్, జులై 26 ప్రభాతవార్త : ఎస్వీ వైద్య కళాశాల రుయా ఆసుపత్రి చిన్న పిల్లల విభాగంలో యునైటెడ్ నేషనల్ చిల్డ్రన్స్ ఫండ్ సంస్థ వారి ఆధ్వర్యంలో చిన్నపిల్లలో మెదడు అభి వృద్ధి వ్యత్యాసాల్లో కలిగే మార్పులను గుర్తిం చుటకు ఈ కార్యశాలను నిర్వహించారు. ఈ కార్యశాలలో యునిసెఫ్ సంస్థ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ పిల్లలకు కనీసం క్రియాత్మక దృష్టి ఉందని నిర్ధారించుకోవాలని, కనిష్టంగా ఉంటే, స్పర్శ, శ్రవణ ఇన్‌పుట్‌లను ఉపయోగిం చాలన్నారు. పిల్లవాడు ఏమి చేయగలడో అలాగే అతను, ఆమె ఏమి చేయలేదో గుర్తించండని, వయస్సుకి తగిన జోక్యాలు కాకుండా ఫంక్షనల్ ప్రొఫైల్, పనితీరు ప్రకారం లక్ష్యాలను సెట్ చేయాలని, బిగుతుగా ఉండే కండరాలను రిలాక్స్ చేయండన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఏ చంద్రశేఖరన్, ఎస్వి వైద్య అధికారి డా. శ్రీహరి, ఎస్వి వైద్య కళాశాల చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్, ఆర్‌బిఎస్‌కె రాష్ట్ర సమన్వయకర్త డా. ప్రశాంత్, ఆర్‌బిఎస్‌కె ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డా. పద్మావతి, ఇండియా మోడ్యూల్ క్రియేటర్ డా. శశికళ, ప్రముఖ పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్, ఎన్‌ఎంసి సభ్యులు డా. సంతోష్ క్రాలేటి, ఆచార్య డా. గాయత్రి, రాష్ట్రంలోని అన్ని డిఈఐసి పిల్లల వైద్యులు, మెడికల్ ఆఫీసర్స్, ఎర్లీ ఇంటర్వెన్షనిస్ట్, స్పిచ్, ఆడియాలోజిస్ట్, ఫాకల్టీ ఆఫ్ పీడియాట్రిక్స్, టీమ్ డిఈఐసి తిరుపతి, ఎస్వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

# మహిళలకు ఇ- సైకిళ్ల పంపిణీకి చర్యలు

**- కడ పి.డి. వికాస్ మర్మత్**



కుప్పంరూరల్, జూలై 26 ప్రభాతవార్త : స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలకు రాయితీతో ప్రభుత్వం ఆదేశాలతో ఇ - సైకిళ్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు కడ ప్రాజెక్ట్ అధికారి వికాస్ మర్మత్ పేర్కొన్నారు. శుక్రవారం ఇ -సైకిళ్ల తయారీ సంస్థ ప్రతినిధులతో ఆయన సమావేశం జరిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రవేశపెడుతున్న ఈకార్యక్రమంలో కుప్పం నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారన్నారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ద్వారా ఈ ఇ - సైకిళ్లను లబ్దిదారులకు పంపిణీ చేస్తామన్నారు. డ్వాక్రా మహిళా స ంఘాల్లో ఉంటూ చిరు వ్యాపారాలు, పాలు, ఇతర విక్రయాలు జరిపే మహిళలకు ఈ ఇ - సైకిళ్లను 9వేలకు అందిస్తున్నట్లు చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో తొలివిడతగా డ్వాక్రా మహిళలు 300మందికి ఈ ఇ -సైకిళ్లను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

**సంస్కరణలు సత్ఫలితాలనిచ్చాయి...**

# ఆదాయాలు గణనీయంగా పెరిగాయి : బొజ్జల



శ్రీకాళహస్తి,జూలై 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంస్కరణలు చేపట్టడంతో ఒక నెలకు హుండీల్లోనే ఆదాయం గణనీయంగా పెరిగిందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తాను గెలిచిన తరువాత ఆలయంలో పలు సంస్కరణలు చేపట్టామని అంతేకాక ప్రక్షాళన ఇక్కడ నుంచి ప్రారంభించామన్నారు. ఒక నెలలోనే హుండీ ఆదాయం రూ.89 లక్షలు పెరిగాయని వివరించారు. ఐదేళ్లలో ఆలయ పరిపాలన అస్తవ్యస్తమైందన్నారు. ఆధ్యాత్మిక నిలయం వ్యాపారకేంద్రంగా మారిందన్నారు. వ్యవసాయ ప్రధానమైన శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రాబోవు వర్షాకాలానికి సంబంధించి అత్యవసర పరిస్థితిలో చెరువుల మరమ్మతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉదారంగా రూ.2కోట్లు నిధులుమంజూరు చేసినట్లు వివరించారు.అలాగే మున్సిపల్ పరిధిలోని కన్నలి కాలువ మరమ్మత్తులకు రూ.60లక్షలు మంజూరుకు భరోసా ఇచ్చినట్లు సుధీర్‌రెడ్డి వివరించారు.